సాక్షి
ప్రకాశం
శుక్రవారం । 3 । మార్చి । 2023



మిరపలో తెగుళ్ల బెడద

మిరప రైతును తెగుళ్లు వెంటాడుతున్నాయి. ముడత, కుచ్చుతెగులు, నల్లతామర, దోమకాటు దెబ్బకు దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు.

- 8లో..



కలుషిత నీరు తాగి విద్యార్థినులకు అస్వస్థత

పెద్దదోర్నాల ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యార్థినులు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురయ్యారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
33 /20

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

దరఖాస్తుకు ఈ నెల 12 తుది గడువు

ఒంగోలు: జిల్లాలో గిరిజనుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న ఎన్‌జీవో/వీఓల సంస్థలు సవరించిన నిబంధనల ప్రకారం ఈనెల 12వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జగన్నాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌జీవో.ట్రైబల్.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడంతోపాటు సంబంధిత దరఖాస్తును ఒంగోలులోని తమ కార్యాలయానికి ఫార్వార్డ్ చేయాలన్నారు. అంతే కాకుండా సంబంధిత దరఖాస్తును మూడు సెట్లు ప్రింటుతో పూర్తి ప్రతిపాదనలను తమ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

ఈనెల 18న స్పెషల్ లోక్ అదాలత్

ఒంగోలు: జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల్లో ఈనెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబ సంబంధ వ్యాజ్యాలు, వినియోగదారుల వివాదాలు, కృత్రిమ మేథోసంపత్తి హక్కులకు సంబంధించిన వివాదాలు, కక్షిదారులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారని, కనుక కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కోర్టు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా పరిశీలన



ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న డీఆర్వో, ఇతర అధికారులు

ఒంగోలు అర్బన్: ఈ నెల 13వ తేదీ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో గురువారం స్పందన భవనంలో జిల్లాలోని 138 పోలింగ్ కేంద్రాల ఓటర్ల జాబితాలు డీఆర్వో ఓబులేసు పరిశీలించారు. మార్క్ చేసిన కాపీల తయారీకి సంబంధించి జాబితాలో పొరపాట్లను పరిశీలించి సవరించే పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. దీనిలో ఓటర్ల జాబితా నోడల్ అధికారి గ్లోరియా, సివిల్ సప్లయిస్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర



పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకులు

త్రిపురాంతకం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని శ్రీశైలం పాదయాత్ర చేస్తున్న బీసీ సంఘ నేత రామాంజనేయులు పేర్కొన్నారు. త్రిపురాంతకంలోని ఆలయాలను దర్శించుకుని అనంతరం మాట్లాడుతూ బాపట్ల జిల్లా టి. చుందూరు మండలం వేటపాలెం నుంచి 24వ తేదీ శుక్రవారం పాదయాత్రగా బయలుదేరినట్లు తెలిపారు. గుంటూరు, నర్సరావుపేట, వినుకొండ, త్రిపురాంతకం మీదగా శ్రీశైలం వెళుతున్నట్లు చెప్పారు. వారం రోజులుగా తాము పాదయాత్ర చేస్తున్న గ్రామాల వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను, నవరత్నాలను వివరించినట్లు చెప్పారు. వేటపాలెం ఎంపీటీసీ రామాంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

గ్రామీణ డాక్ సేవక్‌లకు వేధింపులు తగదు

మార్కాపురం టౌన్: గ్రామీణ డాక్ సేవక్‌లపై అసాధ్యమైన లక్ష్యాలు ఇచ్చి పూర్తి చేయాలని, వేధింపులు తగదని మార్కాపురం డివిజన్ కార్యదర్శి డీ నారాయణ రెడ్డి అన్నారు. హెడ్ పోస్టాఫీస్ వద్ద గురువారం ఏఐజీ డీఎస్‌యూ కేంద్ర సంఘ పిలుపు మేరకు వంద మందికి పైగా గ్రామీణ డాక్ సేవకులు ధర్నా నిర్వహించారు. గిద్దలూరు, కంభం, మార్కాపురం, పొదిలి, కనిగిరి డివిజన్‌ల నుంచి జీడీఎస్‌లు పాల్గొన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కేజీ మీరావలి మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న జీడీఎస్ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రత్యేక ఆహ్వానితుడు డీ మీరావలి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న జీడీఎస్ కమిటీ రిపోర్ట్‌లోని అంశాలను వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డివిజన్ అధ్యక్షుడు బాలంకయ్య, కోశాధికారి కొండయ్య, యూత్ సెక్రటరీ ఎం.వి.నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ఆహార్యంలో అత్యంత భయంకరంగా ఉండే భల్లూకం..పులినైనా ఎదిరించే సత్తా వీటిలో ఉంది. ఇవి ఎంత ప్రమాదకరమో వాటి పిల్లల పట్ల అంత వాత్సల్యంగా ఉంటాయి. భల్లూకాల్లో ఎన్నో రకాల జాతులు ఉన్నప్పటికీ నల్లమల అభయారణ్యంలో తెల్ల మూతులు కలిగి స్లాత్ బేర్‌గా పిలిచే ఇవి చాలా అరుదు. పేరుకు మాంసాహారే అయినా తినేది మాత్రం పండ్లు, చీమలు, చెదలు. నల్లమల ఆడపడుచుగా ఉన్న వీటిపై ప్రత్యేక కథనం..

నల్లమల ఆడపడుచు

- సంతానమంటే వాటికి ఎక్కడ లేని మక్కువ
- తోటి ప్రాణులతో పోల్చితే ఆవేశం ఎక్కువ
- పిల్లల కోసం పులినైనా ఎదుర్కొనే సాహసం
- మాంసాహారే అయినా తినేది పండ్లు, తేనె



వీపుపై పిల్లలతో సంచరిస్తున్న భల్లూకం..

పెద్దదోర్నాల:

నల్లమల అభయారణ్యంలో అత్యంత ప్రమాదకరమైన, అత్యంత వాత్సల్యం కలిగిన జీవి ఎలుగుబంటి. అవి వాటి సంతానం పట్ల ఎంత వాత్సల్యం చూపిస్తాయో, పిల్లల సంరక్షణ పట్ల అంత ప్రమాదకరంగా వ్యవహరిస్తాయి. ఎందుకంటే వాటికి వాటి పిల్లలంటే అంత మక్కువ. అవి వాటిపై ఎంతో ప్రేమాభిమానాలను కనబరుస్తాయి. తన సంతానం కోసం పెద్దపులినైనా ఎదిరించి పోరాడుతాయి. పిల్లలు పెరిగి పెద్దయ్యేంత వరకు తన వీపు పైనే మోసుకుని అడవంతా సంచరిస్తుంటాయి.

మాంసాహారే అయినా తినేది మాత్రం..

భల్లూకాలు చెట్లు ఎక్కటంలో నేర్పరి. ఇవి చిరుత పులుల మాదిరిగానే చెట్లు ఎక్కి వాటి ఆహారాన్వేషణలో పాల్గొంటాయి. ఇవి ఎక్కువగా పండ్లను ఆహారంగా తీసుకుంటుంటాయి. దీని కోసమే అవి చెట్లు ఎక్కుతుంటాయి. ఎత్తుగా ఉండే వెలగపండ్లు, చిటిమిటి కాయలు, టుకీ పండ్లను ఎంతో నేర్పరితనంతో సేకరిస్తుంటాయి. అలాగే చెట్టు కొమ్మలకుండే తేనెపట్టులను అవి ఎంతో నైపుణ్యంగా సేకరించి సేవిస్తుంటాయి. పేరుకు మాంసాహారే కానీ అవి ఎక్కువగా తినేది మాత్రం శాఖాహారం. ఎలుగుబంట్లు ఎక్కువగా పుట్టలను తవ్వి చీమలను తింటుంటాయి. దీంతో పాటు పండ్లు, తేనె, చెదలను ఎక్కువగా తింటుంటాయి. రేగుపండ్లను ఎక్కువగా తింటుంటాయి. ముఖ్యంగా ఈత చెట్లు ఉన్న ప్రాంతాలలో ఎక్కువగా ఉంటాయి. నల్లమలలో వీటి సంఖ్య దాదాపు 500 పైగా ఉంటుంది.

అప్రమత్తత అవసరం..

భల్లూకాల పట్ల అప్రమత్తత ఎంతో అవసరం. కొన్ని ప్రత్యేక పరిస్థితుల ద్వారా ఎలుగుబంట్ల నుంచి రక్షించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఎలుగుబంట్లు దాని వెంట పిల్లలు ఉన్నప్పుడు, దీంతో పాటు ఆహార సేకరణ సమయంలో అంతరాయం కలిగిస్తే అవి రెచ్చిపోతుంటాయి. అడవుల్లో సంచరించే వ్యక్తులు పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ ముందుకు కదలాలి. చీమల పుట్టల వద్ద ఎలుగుబంట్లు కనిపిస్తే పెద్దగా అరుస్తూ కేకలు వేయటం ద్వారా వాటిని బెదరగొట్టవచ్చు. అలాగే పొడవాటి కర్రను తమతో పాటు తీసుకెళ్లాలి. ఎలుగుబంటి పరుగు కూడా చాలా తక్కువగా ఉంటుంది. దూరంగా పరిగెత్తి ప్రాణాలు కాపాడుకునేందుకు వీలుంటుంది.

ఇవి రక్షిత వన్యప్రాణులు...

ఎలుగుబంట్లు రక్షిత జంతువులుగా ప్రభుత్వం గుర్తించింది. ఇది అంతరించి పోయే దశలో ఉన్నందున్న దీనిని వేటాడటం గాని ప్రమాదం కలిగించటంగానీ చేయకూడదు. ఎలుగుబంట్లు సాధారణ పరిస్థితుల్లో ఎవరినీ ఏమీ చేయవు. కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే వాటి నుంచి ఇబ్బందులు లేకుండా తప్పించుకోవచ్చు. అవి దూరంగా సంచరించేటప్పుడు దాన్ని చూస్తే మనం కూడా దూరంగా వెళ్లటం మంచిది. వీటిని నల్లమల ఆడపడుచులుగా పిలుస్తుంటారు.



పిల్లల జోలికొస్తే పులినైనా ఎదిరిస్తున్న ఎలుగుబంటి

ఆవేశం ఎక్కువ..

తన పిల్లల జోలికొస్తే ఎదురుపడిన జీవులను చంపేంత ప్రమాదకారి ఎలుగుబంటి. సాధారణంగా ఏ వన్యప్రాణి అయినా తన పిల్లలతో కలిసి సంచరించేటప్పుడు కాస్తం జాగరూకతతో ఉంటాయి. వాటికి ఆపద జరుగకుండా వ్యవహరిస్తాయి. కానీ ఎలుగుబంట్లకు ఆవేశం పాలు చాలా ఎక్కువ. అది పిల్లలతో సంచరించేటప్పుడు జంతువైనా, మనిషి అయినా ఎదురైతే ఎటువంటి ఆలోచన లేకుండా దాడికి పాల్పడుతుంది. ఈ దాడి ఎంతో ప్రాణాంతకంగా ఉంటుంది. తన పిల్లలను కాపాడుకునేందుకు అవి పెద్దపులలతో కూడా పోరాటానికి దిగిన సందర్భాలు చాలా ఉన్నాయి. అటవీశాఖ అధికారులు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసి ట్రాప్‌డ్ కెమెరాల్లో ఎన్నో సార్లు పులులు, ఎలుగుబంట్లు దాడులు చేసుకున్న సంఘటనలు నిక్షిప్తం అయినట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. అయితే పులితో పోల్చుకుంటే ఎలుగుబంట్ల బలం చాలా తక్కువ, కానీ పిల్లల కోసం శక్తికి మించిన బలంతో అది పులులతో తలబడుతుంది. అయితే ఎలుగుబంట్ల పదునైన గోళ్ల దాటికి పెద్దపులులు కూడా భయపడతాయని అటవీ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. మనుషులపై కూడా అవి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. అభయారణ్యంలో విధులు నిర్వహించే అటవీ సిబ్బంది కూడా ఎలుగుబంట్ల దాడి నుంచి తమను తాము కాపాడుకోవటానికి నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తుంటారు.

మనిషిని చూస్తే గట్టిగా అరుస్తాయి

మనిషిని చూస్తే ఎలుగుబంట్లు భయంకరంగా అరుస్తాయి. దీంతో పాటు మనుషులపై అరుస్తూ గోళ్లతో రక్కి తీవ్రంగా గాయపరుస్తాయి. గతంలో నాపై కూడా ఎలుగుబంటి దాడి చేసింది. దీని వల్ల కంటికి గాయమైంది. మండలంలో చాలా మంది దీని వల్ల గాయపడ్డారు. వారిలో నల్లగుంట్ల చెరువు గూడెంలో ఉన్న ఉత్తలూరి పెద్దన్న, మర్రిపాలెం గూడెంలో జల్లా అంకన్న తదితరులు ఉన్నారు. అటవీశాఖ నుంచి పరిహారం వస్తుండటంతో కొంత మేలు జరుగుతోంది.

- భూమని వీరన్న, చింతలగూడెం

ఎలుగుబంట్లతో అత్యంత ప్రమాదం

ఎలుగుబంట్లతో అప్రమత్తత అవసరం. అవి వాటి పిల్లలతో ఉన్నప్పుడు విచక్షణ కోల్పోయి దాడులకు తెగబడతాయి. ఆ సమయంలో పెద్దపులి అయినా అవి లెక్క చేయవు. నల్లమల అభయారణ్యంలోని అన్ని ప్రాంతాల్లో ఇవి సంచరిస్తుంటాయి.

- విశ్వేశ్వరరావు, ఫారెస్టు రేంజి అధికారి, పెద్దదోర్నాల

త్వరలో ఏకేయూ అకడమిక్ బ్లాక్ తరలింపు

- మరో 15 రోజుల్లోనే చర్యలు
- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం గుర్తింపుతోనే 2023–24 అడ్మిషన్లు
- పేర్నమిట్ట కొండ మీద భవనాలను పరిశీలించిన వీసీ



ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలతో కలిసి పేర్నమిట్టమీద యూనివర్శిటీ భవనాలను పరిశీలిస్తున్న వైస్ ఛాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అకడమిక్ బ్లాక్ తరలింపునకు చర్యలు వేగవంతమయ్యాయి. ఇటీవల వైస్ చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన మారెడ్డి అంజిరెడ్డి గురువారం పేర్నమిట్ట మీద ఉన్న విశ్వవిద్యాలయం అకడమిక్ బ్లాక్ భవనాలను పరిశీలించారు. రహదారి మొత్తం చిల్లచెట్లతో నిండి ఉండడంతో ముందుగా వాటిని తొలగింపజేసి చదును చేయించారు. పంపు హౌస్‌కు సంబంధించి చిన్న చిన్న మరమ్మతులు ఉండడంతో తక్షణమే వాటిని రిపేరు చేయించేందుకు చర్యలు చేపట్టారు. అకడమిక్ బ్లాక్‌లో మొత్తం 12 గదులు ఉండగా వాటిలో వాటర్ పంపింగ్‌కు సంబంధించి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అనేది పరిశీలించారు. విద్యుత్ లైనుకు సంబంధించి కొంత సమస్య ఉన్నట్లు గుర్తించి తక్షణమే బాగు చేయించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భవనాలను శుభ్రం చేయించడంతోపాటు లోపలి వైపు ఆవరణలో ఉన్న చిల్లచెట్లను మొత్తం తొలగింపజేశారు. కొండ మీదకు వెళ్లే రహదారిని తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుతానికి యూనివర్శిటీ అకడమిక్ బ్లాక్ వరకు ఉన్న రెండు రహదారుల్లో ఒక రహదారిని తక్షణమే 60 అడుగుల రోడ్డుగా మార్చాలని నిర్ణయించారు. ఇందుకుగాను రహదారి మధ్యలో డివైడర్‌తోపాటు మొక్కలు నాటడం ద్వారా యూనివర్శిటీ వాతావరణాన్ని చక్కని ఆహ్లాదకరంగా మార్చాలని భావిస్తున్నారు. అందులో భాగంగా యూనివర్శిటీ ప్రాంగణం వద్ద పలు మొక్కలు కూడా నాటాలని నిర్ణయం తీసుకున్నారు. గురువారం వైస్ చాన్సలర్ యూనివర్శిటీ భవనాలను పరిశీలించేందుకు వెళుతున్నారని తెలుసుకున్న జిల్లాలోని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కూడా నేరుగా పేర్నమిట్ట కొండపైకి చేరుకున్నారు. మొత్తం 12 గదులు ఉన్నందున కొన్ని రకాల తరగతులను కూడా మార్చేందుకు అవకాశం ఉన్నట్లు గుర్తించారు. వసతుల పట్ల ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు కూడా సంతృప్తి వ్యక్తం చేయడంతో చిన్న చిన్న మరమ్మతులతోపాటు రంగులు వేయించి మరో పక్షం రోజుల్లో అకడమిక్ బ్లాక్‌ను మార్చాలని నిర్ణయించారు.

2023–24 అడ్మిషన్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఆధ్వర్యంలోనే:

యూనివర్శిటీ వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ అతిత్వరలోనే యూనివర్శిటీ అకడమిక్ బ్లాక్‌ను పేర్నమిట్ట కొండపైకి తరలిస్తామన్నారు. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత చర్యలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రధాన రహదారిని కూడా పూర్తిస్థాయిలో బాగు చేయించాలని ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాథమికంగా ఏమేమి వసతులు అవసరమవుతాయి, వాటికి సంబంధించి ఎటువంటి చర్యలు చేపట్టాలనే దానిపై ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రారంభమయ్యే పోస్టు గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ ప్రవేశాలన్నీ కూడా ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం గుర్తింపుతోనే జరుగుతాయన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల పరిధిలోని విద్యార్థులు ఈ యూనివర్శిటీ పరిధిలోకి వస్తారన్నారు. ఈ సందర్భంగా వీసీ చేపడుతున్న చర్యలకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అభినందనలు తెలిపాయి. యూనివర్శిటీ అభివృద్ధిలో తాము సైతం పాలుపంచుకుంటామని, అందుకు తమకు కూడా అవకాశం కల్పించాలంటూ వారు వైస్ చాన్సలర్‌ను కోరారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- డీఈవో పిల్లి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో పిల్లి రమేష్

రాచర్ల: వచ్చే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఎంఈవోలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఈవో పిల్లి రమేష్ ఆదేశించారు. రాచర్లలోని మోడల్ స్కూల్‌లో రాచర్ల, కంభం, కొమరోలు, గిద్దలూరు, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల ఎంఈవోలకు, మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు గురువారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 28 వేల మంది పదో తరగతి చదువుతున్నారని.. వచ్చే పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. పరీక్షలను దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ కేటాయించాలన్నారు. చదువులో పూర్తిగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా క్లాసులు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు రుచికరంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఎంఈవోలకు ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలల్లో 3, 4 తరగతుల విద్యార్థులకు తరగతులను నిర్వహించకుండా గాలికి వదిలేస్తే ఆ ఉపాధ్యాయులపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట ఎంఈవోలు కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, జింకా వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు, కస్తూరిబా పాఠశాలలు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

18 వేల టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- క్వింటాకు ఎంఎస్‌పీ రూ.5,335 లెక్కన కొనుగోలుకు చర్యలు
- మార్క్‌ఫెడ్ డీఎం కె.హరికృష్ణ
- శనగల కొనుగోలు కేంద్రం, అగ్రిటెస్టింగ్ ల్యాబ్ నిర్మాణ పనుల పరిశీలన



శనగల నాణ్యతను పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ

చీమకుర్తి: జిల్లాలో రైతుల నుంచి ఈ ఏడాది 18 వేల టన్నుల శనగలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కే.హరికృష్ణ తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావుతో కలిసి గురువారం సంతనూతలపాడు మార్కెట్ కమిటీ కార్యాలయం ప్రాంగణంలో శనగల కేంద్రం, నిర్మాణంలోనున్న డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జేజీ–11 రకానికి చెందిన శనగలకు క్వింటాకు రూ.5,335 చొప్పున మద్దతు ధర ఇచ్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. రైతుల వద్ద నుంచి శనగలను సంతనూతలపాడు మార్కెట్ కమిటీ ద్వారా కొనుగోలు చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానిక మార్కెట్ కమిటీ అధికారులకు సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం నిర్మాణంలో నున్న అగ్రి టెస్టింగ్ ల్యాబ్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏడీఏ బీ.రమేష్‌బాబు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా శింగరకొండ తిరునాళ్ల

- 600 మంది బందోబస్తు
- మూడు లక్షలకు పైగా భక్తులు వస్తారని అంచనా
- కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు, ఫ్లెక్సీలు నిషేధం
- ఆర్డీవో సరోజిని



మాట్లాడుతున్న ఆర్డీవో సరోజిని

అద్దంకి: అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా శింగరకొండ తిరునాళ్లను విజయవంతం చేయాలని చీరాల ఆర్డీవో సరోజిని అన్నారు. ఆర్డీవో అధ్యక్షతన శింగరకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో వివిధ శాఖల అధికారులతో తిరునాళ్ల సమన్వయ కమిటీ రెండో సమావేశాన్ని ఆమె గురువారం నిర్వహించారు. ఈ సమావేశం ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోట శ్రీనివాసకుమార్, ఈవో సుభద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనిలో భాగంగా వచ్చే నెల 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న శింగరకొండ 68వ వార్షిక తిరునాళ్లలో తమ శాఖ ఆధ్వర్యంలో తీసుకోనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి చర్చించారు. దేవదాయ శాఖ తరఫున పిల్లలకు పాలు, బిస్కెట్లు, మజ్జిగ మంచినీళ్లు దేవస్థానంలో క్యూలైన్ల ఏర్పాటు, బయో టాయిలెట్లు, ఉచిత ప్రసాదాల పంపిణీ, రూ.50, రూ.100 ప్రత్యేక దర్శన వసతి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఏసీ సభద్ర తెలిపారు.

కొండపైకి ప్రత్యేక బస్సులు:

శింగరకొండపైనున్న లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోనున్న భక్తుల కోసం కొండపైకి దాతల సాయంతో ప్రత్యేక బస్సులు, అన్నదానం, ఉచిత ప్రసాద పంపిణీ చేస్తామని ఈవో కోటిరెడ్డి చెప్పారు. శింగరకొండపాలెం గ్రామ పంచాయతీ తరఫున రోడ్డుకు ఇరువైపులా బారికేడ్ల ఏర్పాటు, పారిశుద్ధ్యం వంటి కార్యక్రమాల నిర్వహణ చేయిస్తామని అధ్యక్షుడు తిరుపతయ్య తెలిపారు. పోలీస్ శాఖ తరఫున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 600 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తుతోపాటు, ప్రధాన తిరునాళ్ల రోజున మేదరమెట్ల పైలాన్ వద్ద, సంతమాగులూరు అడ్డరోడ్డు వద్ద భారీ వాహనాలను దారి మళ్లించి ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తామని చీరాల డీఎస్పీ శ్రీకాంత్ వివరించారు. తిరునాళ్ల రోజున నిరంతరాయ విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు చెప్పారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు శాఖ అధికారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ జామ్ తదితర సమస్యల సమయంలో ఉపయోగపడేలా ఒక క్రేన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. తిరునాళ్లను అందరూ కలిసికట్టుగా నిర్వహించాలని కోరారు. అదే విధంగా ఆర్టీసీ, ఫైర్, హెల్త్, నరసింహ స్వామి దేవస్థానం తరఫున, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు చేపట్టనున్న చర్యలు, ఏర్పాటు చేయనున్న వసతుల గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కోడ్ ఉన్నందున తిరునాళ్లలో ప్రభల వద్ద ఇతర ప్రాంతాల్లో ఎటువంటి పార్టీ జెండాలు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. కోడ్‌ను అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నరసింహ స్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ నర్రావుల కొండలు, ఈవో కోటిరెడ్డి, ఫైర్, ఈవోఆర్డీ, ఆర్‌అండ్‌బీ, హెల్త్, ఆర్టీసీతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాటంరాజు దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఆలయ కమిటీ చైర్మన్ పీఎల్‌పీ యాదవ్



పీఎల్‌పీ యాదవ్‌ను సన్మానిస్తున్న సంఘ నాయకులు

మార్కాపురం: పెద్దారవీడు మండలంలోని కాటంరాజు గంగా భవాని ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్‌గా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది పీఎల్‌పీ యాదవ్ అన్నారు. పట్టణంలోని నెహ్రూ బజార్‌లోని సాయి ఫంక్షన్ హాల్‌లో జిల్లా యాదవ సంఘ సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఎల్‌పీ యాదవ్‌ను ఆలయ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. దేవస్థానం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈనెల 21న కాటంరాజు తిరునాళ్ల ఘనంగా నిర్వహిస్తామని, తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేందుకు పోలీస్ అధికారులతో చర్చిస్తున్నట్లు చెప్పారు. ఆలయ భూములను సర్వే చేయిస్తామని, రక్షణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. యాదవ సంఘం నాయకులు పోలయ్య, వెంకటరాజు, పోల్‌రాజు, గంగరాజు, బుర్రి చిన వెంకటేశ్వర్లు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీఎల్‌పీ యాదవ్‌ను ఘనంగా సన్మానించారు.

క్లుప్తంగా

హత్య కేసులో భర్త అరెస్టు

బేస్తవారిపేట: భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు ఎస్సై మాధవరావు తెలిపారు. మండలంలోని పందిళ్లపల్లె ఎస్సీ కాలనీకి చెందిన బసవరాజు, కోటేశ్వరి భార్యభర్తలు. ఈ క్రమంలో ఇద్దరూ తరుచూ గొడవపడేవారు. గొడవ పడిన ప్రతిసారి భార్య చెట్టిచర్లలోని పుట్టింటికి వెళ్లేది. బసవరాజు భార్య, అత్తకు నచ్చ చెప్పుకొని కాపురానికి తెచ్చుకునేవాడు. ఈ నేపథ్యంలో భార్యనుచంపాలని నిర్ణయించుకొని గత నెల 26న అత్తగారి ఇంటికి వెళ్లి నేను మారానని నమ్మించి రాత్రి అక్కడే ఉన్నాడు. ఉదయం భార్యను మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని పందిళ్లపల్లె వెళ్తున్నానని చెప్పి పిన్ని గ్రామమైన పోరుమామిళ్ల మండలంలోని అక్కలరెడ్డిపల్లెకు తీసుకెళ్లాడు. సాయంత్రం అక్కలరెడ్డి సమీపంలోని బ్రిడ్జి పక్కన ఉన్న వాగులోకి తీసుకెళ్లి కర్రతో ఇష్టం వచ్చినట్లు కొట్టాడు. ఆమెను అక్కలరెడ్డి పల్లెకు తీసుకెళ్లి పిన్ని ఇంట్లోకి తీసుకెళ్లి మోటార్‌సైకిల్‌పై నుంచి కిందపడినట్లు చెప్పాడు. అక్కలరెడ్డి పల్లెలో ఆటోను బాడుగకు మాట్లాడుకుని పోరుమామిళ్ల వైపు వెళ్తుండగా కోటేశ్వరి మృతి చెందింది. అదే ఆటోలో మృతురాలిని పందిళ్లపల్లె ఎస్సీకాలనీకి తీసుకొచ్చాడు. మోటార్‌సైకిల్‌పై నుంచి పడి తన భార్య మృతిచెందినట్లు నమ్మించాలని ప్రయత్నించాడు. మృతురాలి తల్లి అచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. బసవరాజును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ నుంచి జారి పడి మహిళ మృతి



రాజమ్మ మృతదేహం

గిద్దలూరు రూరల్: బైక్ నుంచి జారి పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని పొదలకుంటపల్లె గ్రామ సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాచర్ల మండలం కాలువపల్లె గ్రామానికి చెందిన రాజమ్మ(55) గిద్దలూరు మండలం తంబళ్లపల్లెలో వారి బంధువుల వద్దకు వెళ్లేందుకు సచివాలయ ఉద్యోగి బైక్‌పై వెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడి తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

యద్దనపూడి: జిల్లాస్థాయి తైక్వాండో పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పూనూరు ఫిజికల్ డైరెక్టర్ టి. అంకరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన ఆదివారం పూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు న్యూ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. క్రీడాకారులు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో విశాఖపట్నంలోని యలమంచిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 9493923121 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

మిరపలో తెగుళ్ల బెడద



హెచ్‌ఎం పాడులో సాగుచేసిన మిరప పంట

- దెబ్బతిన్న తోటలు
- తగ్గిన దిగుబడి
- నాణ్యత కోల్పోయిన కాయ
- ఆందోళనలో రైతులు

హనుమంతునిపాడు: మిరప రైతును తెగుళ్ల వెంటాడుతున్నాయి. పంట దిగుబడి, నాణ్యతపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో 83,106 ఎకరాల్లో మిరప సాగుచేశారు. గత డిసెంబర్‌లో మాండూస్ తుఫాన్ ప్రభావంతో మిరప తోటలకు తెగుళ్లు సోకి దెబ్బతిన్నాయి. పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వేలకు వేలు ఖర్చు చేసి తెగుళ్ల నివారణ మందు పిచికారీ చేసినప్పటికీ తెగుళ్ల అదుపులోకి రాలేదు. ముడత, కుచ్చు తెగుళ్లు, నల్లతామర, దోమ కాటు దెబ్బకు దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో పాటు ధర కూడా ఆశించిన స్థాయిలో లేదని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది కుచ్చు తెగులు, ఆకుముడత తెగుళ్ల నివారణకు దాదాపుగా 30 దఫాలు మందులు పిచికారీ చేయాల్సి వచ్చింది. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు అధిక ధరలకు మందులు విక్రయించారు. చీడపీడల దెబ్బకు ఎకరాకు 10 నుంచి 15 క్వింటాల దిగుబడి మాత్రమే వస్తోంది. ఈ ఏడాది ఎకరాకి 20 నుంచి 25 క్వింటాల దిగుబడి వస్తుందని ఆశించగా, తెగుళ్ల దెబ్బ తీశాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జనవరి నెలలో గుంటూరు మార్కెట్‌లో లావు మిర్చి క్వింటా రూ.27 వేలు పలికింది. ప్రస్తుతం క్వింటా మిర్చి రూ.18 వేల నుంచి రూ.19 వేలు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. గుంటూరు మార్కెట్‌లో తాలు మిర్చిని రూ.10 వేల నుంచి రూ.11 వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.



మిరపకాయలు గ్రేడ్ చేస్తున్న కూలీలు



తెగుళ్లతో నాణ్యత కోల్పోయిన తాలు కాయ

తుఫాన్ తెచ్చిన తంటా...

గతేడాది డిసెంబర్‌లో మాండూస్ తుఫాన్‌కు కురిసిన భారీ వర్షాలే మిర్చి పంటను మింగేశాయి. ఒక్క కనిగిరి డివిజన్‌లోనే ఆరు మండలాల్లో 500 ఎకరాల్లో రైతులు సాగుచేసిన మిర్చి పంటను తెగుళ్ల బారిన పడేశాయి. వ్యవసాయ బోరు బావుల కింద కష్టపడి సాగుచేసిన మిర్చి తెగుళ్లతో పాడైపోవడంతో రైతులు తల్లడిల్లిపోయారు. తెగుళ్లతో ఎక్కువ శాతం తాలు కాయ వచ్చింది. కాయ ఎండిన తర్వాత రంగు కూడా మారింది.

భవన నిర్మాణ కార్మికులకు భరోసా



ఎంపీడీవోతో మాట్లాడుతున్న లేబర్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌కుమార్

మద్దిపాడు: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం ఈ శ్రామ్, వైఎస్సార్ బీమా పథకాల ద్వారా భరోసా ఇస్తోందని లేబర్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసకుమార్ అన్నారు. మద్దిపాడు సచివాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాసరావుతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులను గుర్తించే విషయంలో మద్దిపాడు మండలం ముందంజలో ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఈ శ్రామ్, వైఎస్సార్ బీమా పథకాలలో నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ పథకాల ద్వారా కార్మికుని కుమార్తె వివాహానికి రూ.20 వేలు, ఎవరైనా కార్మికుడు ప్రమాదంలో మృతిచెందితే రూ.5 లక్షలు, సాధారణ మరణానికి 51 సంవత్సరాల్లోపు వారికి రూ.60 వేలు, 51 నుంచి 60 సంవత్సరాల వయసు వారికి రూ.30 వేలు లభిస్తాయని తెలిపారు. ప్రమాదంలో గాయపడి పూర్తిగా పని చేయలేని పరిస్థితిలో ఉంటే వారికి సదరం సర్టిఫికెట్‌లో ఉండే శాతాన్ని బట్టి జీవితాంతం పెన్షన్ ఏర్పాటు, ప్రమాదంలో గాయాలపాలై మంచంలో ఉంటే అటువంటి వారికి 45 రోజుల పాటు రోజుకు రూ.300 ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా భవన నిర్మాణ కార్మికులు పేరు నమోదు చేయించుకోకపోయినా వారు లేబర్ కార్యాలయంలో తెలిపితే రూ.50 వేలు ఇస్తున్నట్లు తెలిపారు. అంతేగాకుండా కార్మికుల పిల్లలు 9వ తరగతి నుంచి ఇంటర్ చదువుతుంటే వారికి రూ.1,200, బీటెక్, తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తుంటే వారికి రూ.5 వేలు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఒంగోలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, సిబ్బంది నారాయణ రాజ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయ ఏవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో చదివితే మంచి ఫలితాలు



జగనన్న కాలనీ లేఅవుట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



కేజీబీవీలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

- బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్
- కేజీబీవీ, జగనన్న కాలనీ లే అవుట్ల తనిఖీ

బల్లికురవ: ఆడపిల్లల చదువు ఆ ఇంటికే వెలుగునిస్తుందని, లక్ష్యంతో ధైర్యంగా చదివితే పదిలో మంచి ఫలితాలు సాధించవచ్చని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. గురువారం బల్లికురవలోని కస్తూరిబా గాంధీ గురుకుల బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతుల వారీగా విద్యార్థులతో ముచ్చటించారు. జీవితంలో స్థిరపడే వరకు వివాహాలు చేసుకోవద్దని, బాలికలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని చెప్పారు. విద్యాలయంలో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యలో వెనుకబడిన బాలికలకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ముందుకు తీసుకురావాలన్నారు. బాలికలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని ప్రిన్సిపాల్ సరళకుమారిని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భేటి బచావో–భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా పోస్టర్ ఆవిష్కరించారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలాల వారీగా ఘనంగా నిర్వహించుకోవాన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయించండి...

ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా మంజూరు చేసిన గృహాలను మార్చి 20వతేదీ లోపు పూర్తి చేయించి ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బల్లికురవలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను ఆమె పరిశీలించారు. కాలనీకి 20 గృహాలు మంజూరు కాగా పది ఇళ్లు మాత్రమే పూర్తయ్యి, మిగతా అసంపూర్తిగా ఉండటంతో లబ్ధిదారులతో మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రూ. 19 లక్షల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. బల్లికురవ కూడలిలోని నాలుగు రోడ్లలో ఆక్రమణలు పూర్తిస్థాయిలో తొలగించనందున సైడు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆమె వెంట ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ పీ. సీతారత్నం, గృహ నిర్మాణశాఖ పీడీ ప్రసాద్, ఈఈ దాశరథి శర్మ, డీఈవో పీవీజే రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసరావు ఎంపీడీవో సీహెచ్ కృష్ణ, వైద్యాధికారి రమీజ్ అహ్మద్, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన మహిళ

చీరాల రూరల్: రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన గురువారం చీరాల–వేటపాలెం రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య వివరాల మేరకు.. చీరాల–వేటపాలెం రైల్వేస్టేషన్ల మధ్య ఎంజీసీ హౌసింగ్ కాలనీ సమీపంలో సుమారు 30–35 ఏళ్ల వయసు కలిగిన మహిళ ఎగువ లైన్ రైలు పట్టాలపై మృతి చెందిన్నట్లు సమాచారం అందిందని చెప్పారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతురాలు ఎరుపు రంగు చాయ కలిగి ఉన్నట్లు చెప్పారు. మృతురాలు ఆచూకీ తెలిస్తే జీఆర్పీ పోలీసులు 94406 27646 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై సూచించారు.

కలుషిత నీరు తాగి విద్యార్థినులకు అస్వస్థత

- 27 మంది విద్యార్థినులకు కడుపునొప్పితో వాంతులు, విరోచనాలు
- పెద్దదోర్నాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఘటన



పాఠశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి



వైద్యశాలలో విద్యార్థినులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దదోర్నాల: కలుషిత నీరు తాగి పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. ఈ సంఘటన పెద్దదోర్నాల మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం చోటు చేసుకుంది. దీంతో విద్యార్థినులు కొందరిని హుటా హుటిన మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వారికి చికిత్సలు నిర్వహించారు. మరి కొందరికి పాఠశాలలోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. పాఠశాలలో ఉదయాన్నే భోజనం చేసిన తర్వాత ఒకరితరువాత ఒకరికి వాంతులు, విరోచనాలతో పాటు, ఒళ్లు నొప్పులు వచ్చినట్లు విద్యార్థినులు పేర్కొన్నారు. పాఠశాలలో గతంలో ఉన్న ఆర్వో ప్లాంట్‌ను మార్చి కొత్త ప్లాంట్ ఏర్పాటు చేశారు. అందులోని కెమికల్స్ ప్యూరిఫై కాకపోవటం వల్లే ఇలా జరిగి ఉంటుందని సిబ్బంది పేర్కొంటున్నారు. విద్యార్థినులు అస్వస్థతకు గురైన సమాచారమందుకున్న శ్రీశైలం ప్రాజెక్టు అధికారి రవీంద్రారెడ్డి, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసరావు, తహశీల్దార్ వేణుగోపాలరావు, ఎస్సై శ్రీనివాసరావులు హుటాహుటిన పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని, కంగారు పడాల్సిన అవసరం లేదని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థినులు అస్వస్థతకు గురి కావటానికి కారణం ఆహారమా, తాగునీరా అన్న విషయాన్ని తేల్చేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో నిజ నిర్ధారణ కమిటీ వేశామని చెప్పారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ జోబుకు పలు సూచనలు చేశారు. వైద్యశాలలో చేరిన విద్యార్థినులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి, సర్పంచ్ చిత్తూరి హారిక, గుమ్మా యల్లేష్, సచివాలయాల కన్వీనర్ రమణారెడ్డి పరామర్శించి పండ్లు, బ్రెడ్‌లు అందజేశారు. మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులతో ఫోన్లో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర సేతుమాధవన్ విద్యార్థులను పరామర్శించారు.

ఉసురు తీసిన ఈత సరదా



కాలువలో గాలిస్తున్న ఒంగోలు అగ్నిమాపక శాఖ రిస్క్ టీం



చిన్నం మాధవ్ మృతదేహం

చీమకుర్తి: ఈత సరదా ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఉసురు తీసింది. చీమకుర్తిలో పడమర వైపు బైపాస్ సమీపంలోని సాగర్ కాలువలో గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒంగోలు సుజాతనగర్‌కు చెందిన చిన్నం మాధవ్ (21) ఒంగోలులోని రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో సీఎస్‌ఈ గ్రూప్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చీమకుర్తిలో స్నేహితుడి తండ్రి పెద్ద కర్మ ఉండటంతో 12 మంది స్నేహితులతో కలిసి వచ్చాడు. అందరూ మధ్యాహ్నం భోజనం చేశారు. అనంతరం చీమకుర్తి పట్టణాన్ని ఆనుకుని ఉన్న సాగర్ కాలువలో నీటి ప్రవాహాన్ని చూసి సరదాగా ఈతకు దిగారు. వారిలో చిన్నం మాధవ్‌కు ఈత రాకపోయినా నీటిలో దిగాడు. రామతీర్థం రిజర్వాయర్ నుంచి ఒంగోలు ఎస్‌ఎస్ ట్యాంకులకు సాగర్ నీరు ఇస్తుండటంతో రెండు రోజుల నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. అది గమనించని ఇంజినీరింగ్ విద్యార్థులు ఈతకు దిగారు. చిన్నం మాధవ్ కాలువ డ్రాప్‌ల వద్ద ఈత కొడుతున్న సమయంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పట్టు తప్పి నీటిలో పల్టీలు కొడుతూ ప్రాణాలొదిలాడు. మాధవ్‌ను రక్షించేందుకు మిగిలిన వారికి వీలు కాక సమీపంలో ఉన్న బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పోలీసులు కూడా ఏమీ చేయలేక ఒంగోలు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ నుంచి ఏడీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి, ఎల్‌ఎఫ్ సురేష్, ఎఫ్‌ఎం శ్రీహరి, దేవకుమార్‌లు సేఫ్టీ జాకెట్స్ ధరించి కాలువ రెండు ఒడ్డులను కలుపుతూ తాడు కట్టి దాని సాయంతో కాలువలోని డ్రాప్‌ల వద్ద ఉన్న మాధవ్ మృతదేహాన్ని అతి కష్టం మీద బయటకు తీశారు. బంధువుల ద్వారా పోలీసులు పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేశారు.

ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కృష్ణవేణి

- ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు నియామకం



కృష్ణవేణి పరాంకుశం

టంగుటూరు: మండలంలోని పొందూరు గ్రామానికి చెందిన జిల్లా కళావేదిక కార్యదర్శి కృష్ణవేణి పరాంకుశం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆ మేరకు అంతర్జాతీయ సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ గురువారం నియామకపత్రం జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏప్రిల్ 9, 10 తేదీల్లో పుణ్యక్షేత్రమైన తిరుపతి మహతి ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో 48 గంటల పాటు సాహితీ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక కవులు, కళాకారులు సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రపంచ సాహితీ చరిత్రలో పలు రికార్డులు కైవసం చేసుకుంటూపోతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తనను ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నియమించిన సంస్థ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌కు ధన్యవాదాలు తెలిపారు.